

కొత్తగా 7123 మందికి పింఛన్లు : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో వైఎస్ఆర్ పెన్షన్ కానుక కింద నూతనంగా 7,123 మందికి లబ్ధి చేకూరిందని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో పెన్షన్ పెంపు వారోత్సవాల ప్రారంభోత్సవంలో సిఎం జగన్ పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు వీడియోకాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. అనంతరం కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ జిల్లాలో 2,22,974 మంది పెన్షన్ లబ్ధిదారులున్నారన్నారు. వీరికి రూ.60.84 కోట్ల చెక్కును అందజేశారు. భీమవరం ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహరాజు, డిసిఎంఎస్ ఛైర్మన్ వేండ్ర వెంకటస్వామి, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు కె.కుటుంబరావు, డిఆర్‌డిఎ పీడీ వేణుగోపాల్, డిఎల్‌డిఒ కెసిహెచ్.అప్పారావు, పింఛనుదారులు పాల్గొన్నారు

చర్చిస్తూ.. తీర్మానిస్తూ..!



మహాసభలో మాట్లాడుతున్న గఫూర్

కార్యదర్శి నివేదిక అంశాలపై చర్చించిన ప్రతినిధులు

పలు తీర్మానాలు ఆమోదించిన మహాసభ

ఉద్యమాలతో నిర్బంధాలు తిప్పికొట్టాలి

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎ.గఫూర్

రెండో రోజు ఉత్సాహంగా సాగిన సిఐటియు రాష్ట్ర మహాసభ

ప్రజాశక్తి - భీమవరం

సిఐటియు 16వ రాష్ట్ర మహాసభను పురస్కరించుకుని షడ్రక్, సూర్యనారాయణ (అల్లూరి శ్రీరామరాజు కల్యాణ మండపం)లో మంగళవారం ప్రతినిధుల సభ రెండోరోజు పలు అంశాలపై చర్చించి తీర్మానాలను అమోదించింది. తొలుత సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎ.గఫూర్ కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. రాష్ట్రంలో గత మూడేళ్ల కాలంలో సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పోరాటాలు, ఉద్యమాలు, సేవా కార్యక్రమాలతోపాటు జరిగిన లోటుపాట్లను గుర్తు చేశారు. ఇవన్నీ గమనంలో ఉంచుకోవడంతోపాటు రాబోయే కాలంలో ఐక్య కార్యాచరణ ద్వారా ఉద్యమాలను మరింత ఉధృతం చేయాలని దిశానిర్దేశం చేశారు. కార్యదర్శి నివేదికపై క్షుణ్ణంగా చర్చించిన 27 జిల్లాల కార్మిక ప్రతినిధులు తమ అభిప్రాయాలు తెలిపి ఏకగ్రీవంగా ఆమోదించారు. రాష్ట్రంలో ఉద్యమాలు, పోరాటాలు, సేవా కార్యక్రమాలు, కార్మిక సమస్యలతోపాటు ప్రజా సమస్యల పరిష్కారానికి చూపిన చొరవ, సాధించిన ఫలితాలను వివిధ జిల్లాల ప్రతినిధులు మహాసభ ముందుంచారు. కార్మిక ప్రతినిధులు పలు తీర్మానాలను మహాసభలో ప్రవేశపెట్టారు. దీనిలో ఏప్రిల్ ఐదో తేదీన చలో ఢిల్లీ, విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా, కనీస వేతనాల అమలుపై పోరాటాల ఆవశ్యకత వంటి తీర్మానాలను కార్మిక ప్రతినిధులు బలపర్చడంతోపాటు ఆమోదం తెలిపారు. ముందుగా సిఐటియు రాష్ట్ర నాయకులు అజయ్‌కుమార్ కరోనా విపత్కర పరిస్థితులు, ప్రమాదాలు, రైతాంగ ఉద్యమంలో మృతులకు సంతాపం తెలుపుతూ ప్రవేశ పెట్టిన తీర్మానాన్ని మహాసభ ఆమోదించింది.

నిర్బంధాలను సమరశీలంగా తిప్పికొట్టాలి
సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎ.గఫూర్

మూడేళ్ల కాలంలో కార్మిక ఉద్యమాలపై ప్రభుత్వ నిర్బంధాలు ఎక్కువయ్యాయని, ఈ నేపథ్యంలో ఉద్యమాల ద్వారా నిర్బంధాలను తిప్పికొట్టాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎ.గఫూర్ పిలుపునిచ్చారు. గత ప్రభుత్వం కార్మిక నాయకులను నిర్బంధిస్తే ఈ ప్రభుత్వం గృహ నిర్బంధాలు చేస్తుందన్నారు. సమస్యలు పరిష్కరించలేని పాలకులు కొత్త సాకులు చూపుతూ దశాబ్దాల కాలంగా చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్న స్కీమ్‌వర్కర్లపై దాడులు విస్తృతం చేసిందన్నారు. షాపింగ్‌మాల్స్‌లో రూ.ఏడెనిమిది వేలతో పని చేస్తున్న కార్మికులకు కనీస సౌకర్యాలు ఉండటం లేదన్నారు. కాంటాక్ట్, ఔట్‌సోర్సింగ్, షెడ్యూల్డ్ రంగాల్లో వేలాది కార్మికులు పని చేస్తున్నా వారి సంరక్షణకు ప్రభుత్వం సంసిద్ధంగా లేదన్నారు. వలస కార్మికులు జిల్లా, మండలాలకు వస్తే అక్కడ తహశీల్దార్ నమోదు చేసి వేతనాలు, సౌకర్యాలపై రిజిస్టర్ నిర్వహించాలని చట్టం చెబుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఇటీవల కాలంలో కార్మికులు వలసలు వెళ్తూ ప్రమాదంలో చనిపోయిన వారికి పరిహారం సక్రమంగా ఇవ్వడం లేదని విమర్శించారు. 2019 తర్వాత చిరుద్యోగులపై వేధింపులు ఎక్కువయ్యాయన్నారు. అనంతపురంలో వికలాంగురాలైన విఒఎను విధి నిర్వహణలో వేధించి బలన్మరణానికి ఈ పాలకులు కారకులయ్యారన్నారు. ఆశా, అంగన్వాడీలను తొలగించాలని ఎంఎల్‌ఎలు, స్థానిక ప్రజాప్రతినిధులు పదేపదే ఒత్తిడి చేస్తున్నారని, చిరుద్యోగులను టార్గెట్ చేయడం మానుకోవాలని హెచ్చరించారు. కార్మికులు తమ వేతనాలు, ఉపాధిపై ఆందోళన చేస్తుంటే యజమానులు గూండాలను (బౌన్సర్లు) తీసుకొచ్చి కార్మికులపై దాడులకు పాల్పడుతున్నారన్నారు. ఆంధ్రుల హక్కు విశాఖ ఉక్కును ప్రయివేట్‌పరం వ్యతిరేకంగా 690 రోజులుగా అక్కడి కార్మికుల ఆందోళన చేస్తున్నారని తెలిపారు. కేంద్రం మాత్రం నిరంకుశంగా ముందుకు సాగుతుందన్నారు. ఈ మహాసభలో విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం కార్యాచరణ రూపొందిస్తామన్నారు. మూడేళ్ల కాలంలో సంఘం ఆధ్వర్యంలో కార్మికులు, కర్షకుల సమస్యలపై అలుపెరుగని పోరాటం చేశామన్నారు. గత పోరాటాల అనుభవాలతో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు.



సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గఫూర్, నేతలు

డబుల్ ఇంజిన్ ప్రభుత్వాన్ని త్రిబుల్ ఇంజిన్ల (కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘం)తో ఎదుర్కొంటాం
సిఐటియు రాష్ట్ర మహాసభలో ఏపి వ్యకాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు

దేశంలో మోడీ, అమిత్ షా (అంబానీ, అదాని) డబుల్ ఇంజిన్ ప్రభుత్వం కార్మికులు, శ్రామికులపై చేస్తున్న దాడులను త్రిబుల్ ఇంజిన్ల (కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికుల) సహకారంతో ఎదుర్కొందామని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. భీమవరంలో జరుగుతున్న సిఐటియు 16వ రాష్ట్ర మహాసభలో ఆయన పాల్గొని వ్యవసాయ కార్మిక సంఘం తరపున సౌహార్ద్ర సందేశం అందించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేశంలో బిజెపి, ఆర్ఎస్ఎస్ విధానాల వల్ల కార్మికులు, రైతులపై దాడులు విస్తృతమయ్యాయన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ శ్రామికులకు ఉపాధి లేకుండా చేస్తుందన్నారు. నూతన ఆర్థిక విధానాలు అమలైన తర్వాత వ్యవసాయ రంగం పెట్టుబడిదారీ వ్యవసాయం గ్రామీణ ప్రాంతాలకు వచ్చిందన్నారు. ఈ ప్రభావంతో గ్రామీణ ప్రాంత వ్యవసాయ కార్మికులపై మరింత భారం పడిందన్నారు. ఈ కాలంలో వ్యవసాయ రంగాల్లో యాంత్రీకరణ పెరిగి, వ్యవసాయ కార్మికులు గ్రామీణ వ్యవసాయేతర కార్మికులుగా మారారన్నారు. యాంత్రీకరణ పెరగడం వల్ల వ్యవసాయంలో ఏడాదికి 50 రోజులైనా పనులు దొరకడం లేదని, దీనివల్ల వ్యవసాయ కార్మికులు వలసలు వెళ్లిపోతున్నారని అన్నారు. ప్రతిరోజూ వలస కార్మికులు చనిపోతున్నా పాలకులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. గ్రామీణ శ్రామికులు 48 రకాల వ్యవసాయేతర పనులకు వెళ్తున్నారన్నారు. వ్యవసాయేతర రంగాల్లో పని చేస్తున్న శ్రామికులకు కార్మిక సంఘాలు తోడుండాలని సూచించారు. రాష్ట్రంలో అభివృద్ధి పేరుతో 2013 భూసేకరణ చట్టానికి విరుద్ధంగా 5.50 లక్షల ఎకరాల (భూబ్యాంక్) భూములు సేకరించారన్నారు. ఆ భూములు పేదలకు తిరిగివ్వాలని ఆందోళన చేస్తుంటే దీక్ష వద్దకు వచ్చి ఆరు నెలల్లో మన ప్రభుత్వం వస్తుందని, భూ సమస్య పరిష్కారమవుతుందని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్ నాలుగేళ్లవుతున్నా ఎందుకు సమస్యను పరిష్కరించలేదని స్పష్టం చేయాలన్నారు. రాష్ట్రంలో ఉన్న భూసమస్యను పరిష్కరించాలన్నారు. కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు ఐక్యమై ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న సిఐటియు తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు



వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు




సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు



సిఐటియు రాష్ట్ర కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్





చర్చల్లో ఏలూరు జిల్లా నుంచి మాట్లాడుతున్న జి.రాజు, సుభాషిణి





పశ్చిమగోదావరి జిల్లా నుంచి మాట్లాడుతున్న కర్రి నాగేశ్వరరావు, హసీనా బేగం

ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

ఆధార్ నమోదు చేసుకుని పదేళ్లు దాటిన ప్రతిఒక్కరూ ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి ఆధార్ మోనటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల జీవనశైలిలో ఆధార్ ప్రధాన అంశంగా మారిందన్నారు. పదేళ్ల క్రితం ఆధార్ పొంది అనంతరం అప్‌డేట్ చేయించకపోతే ఇప్పుడు జిల్లాలో ఏర్పాటు చేసిన సెంటర్ల ద్వారా అప్‌డేట్ చేసుకోవాలన్నారు. జిల్లాలో 515 సచివాలయాలుండగా ప్రతి ఐదు సచివాలయాల పరిధిలో ఒకటి చొప్పున 103 ఆధార్ సెంటర్లు అందుబాటులో ఉంచామన్నారు. వీటితో కలిపి జిల్లాలో మొత్తం 384 ఆధార్ సెంటర్లు వినియోగంలో ఉన్నాయన్నారు. ప్రయివేటు, ప్రభుత్వాసుపత్రుల్లో బిడ్డ పుట్టిన వెంటనే ఆధార్ నమోదుకు ప్రత్యేక సెంటర్లను ఏర్పాటు చేశామని తెలిపారు. ఆధార్ ప్రయోజనాలపై వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ జెవి.మురళీ, ఆధార్ మోనటరింగ్ కమిటీ కన్వీనర్ అండ్ జిల్లా జిఎస్‌డబ్ల్యుఎస్ అధికారి కెసిహెచ్.అప్పారావు, యుడిఎఐ అసిస్టెంట్ మేనేజర్ బి.వరప్రసాద్, ఇ-గవర్నెన్స్ జిల్లా కోఆర్డినేటర్ ఎం.హేమశేఖర్, కమిటీ సభ్యులు బి.సుజాతరాణి, వేణుగోపాల్, డి.మహేశ్వరరావు, ఆర్‌వి.రమణ పాల్గొన్నారు.

గ్రూప్-1 పరీక్షలు పగడ్బందీగా నిర్వహించాలి

ప్రజాశక్తి - భీమవరం



మాట్లాడుతున్న దాసి రాజు

ఈనెల ఎనిమిదో తేదీన నిర్వహించే ఎపిపిఎస్‌సి గ్రూపు-1 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఇన్‌ఛార్జి జిల్లా రెవెన్యూ అధికారి దాసి రాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో చీఫ్ సూపరింటెండెంట్లు, హాల్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లతో ఆయన సమీక్షించారు. జిల్లాలో భీమవరంలో 10 సెంటర్లలో ఈ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకూ, మధ్యాహ్నం రెండు గంటల నుండి నాలుగు గంటల వరకూ నిర్వహిస్తామన్నారు. కెజిఆర్ఎల్ కళాశాల, డిఎన్ఆర్ కళాశాల, విష్ణు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, విష్ణు మహిళ ఇంజినీరింగ్, విఎస్‌కె డిగ్రీ, కెజిఆర్ఎల్ పిజి కోర్స్, డాక్టర్ సిఎస్ఎన్ డిగ్రీ అండ్ పీజీ, శ్రీఆదిత్య డిగ్రీ, కెజిఆర్ఎల్, ఆఫ్ ఫార్మసీ, బ్రౌనింగ్ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఒక్కొక్క పరీక్షా కేంద్రానికి కో ఆర్డినేటింగ్ అధికారులను నియమించామని, ప్రతీ హాలుకు చీఫ్‌సూపరింటెండెంట్లను, ఆఫీసర్లను నియమించామని తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్‌పి సుబ్బరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెసి మురళీ

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

ప్రజాశక్తి - పెనుగొండ

అర్హులందరికీ ప్రభుత్వ ఫలాలు అందిస్తున్నామని జాయింట్ కలెక్టర్ జెవి.మురళీ అన్నారు. మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద కొత్తగా మంజూరైన పెన్షన్లు ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజుతో కలిసి జెసి లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ సిఎం జగన్ రాజమండ్రిలో పెన్షన్ పెంపును మంగళవారం ప్రారంభించారన్నారు. నూతన సంవత్సర కానుకగా ప్రభుత్వం పెంచిన పెన్షన్ వృద్ధాప్య, వితంతు, చేనేత, మత్స్యకార, కల్లుగీత కార్మికులు, చర్మకారులు, ఒంటరి మహిళలకు ఈనెల ఒకటో తేదీ నుంచి పింఛన్లు రూ.2500 నుండి రూ.2750కు పెంపుదల చేశారన్నారు. 60 ఏళ్లు దాటిన ప్రతిఒక్కరూ పెన్షన్‌కు అర్హులని, వారంతా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంఎల్‌ఎ శ్రీరంగనాథరాజు మాట్లాడుతూ ఆచంట నియోజవర్గంలో కొత్తగా 1333 పింఛన్లు మంజూరు చేశామన్నారు. మొత్తం 33,774 మందికి రూ.9 కోట్ల 13 లక్షల లబ్ధి చేకూర్చామన్నారు. పెన్షన్‌కు అర్హతున్నవారు వాలంటీర్ల ద్వారా తమ దరఖాస్తులు అందిస్తే పెన్షన్ మంజూరుకు చర్యలు తీసుకుంటామన్నారు కొత్తగా మంజూరైన పెన్షన్ సొమ్మును, మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, జెడ్‌పిటిసి సభ్యులు పోడూరి గోవర్ధన్, వైస్ఎంపిపిలు పాలపర్తి సుబ్రహ్మణ్యం, తోలేటి శ్రీను, గ్రామ సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

14 నుంచి జాతీయస్థాయి కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

నరసాపురం రుస్తుంబాదలో జాతీయస్థాయి స్త్రీ, పురుష కబడ్డీ పోటీలు గోగులమ్మ అమ్మవారి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి 18వ తేదీ వరకు నిర్వహిస్తామని నిర్వాహకులు, మాజీ ఎమ్మెల్యే కొత్తపల్లి జానకీరామ్ అన్నారు. మంగళవారం స్థానిక గోగులమ్మ ఆలయం వద్ద నిర్వహించిన విలేకర్ల సమావేశంలో జానకీరామ్ మాట్లాడారు. జాతీయస్థాయిలో జరిగే ఈ పోటీల్లో పురుషుల విభాగంలో 15 టీములు, మహిళా విభాగంలో 15 టీములు పాల్గొంటాయన్నారు. హర్యానా, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, చండీఘర్, రాజస్థాన్, బీహార్, కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ, పాండిచ్చేరి, వెస్ట్ బెంగాల్, జమ్ము కాశ్మీర్, ఆంధ్రా, కేరళ, తమిళనాడు తదితర రాష్ట్రాల నుంచి క్రీడాకారులు పాల్గొంటారన్నారు. మొదటి బహుమతి రూ లక్ష, ద్వితీయ బహుమతి రూ.75 వేలు, తృతీయ బహుమతి రూ.50 వేలు, నాలుగో బహుమతి రూ.25 వేలు నగదు అందిస్తామన్నారు. ఉత్సవాల్లో భాగంగా వివిధ సాంస్కృతిక, సినీ మ్యూజికల్ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఎపి కబడ్డీ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.అర్జునరావు, జనరల్ సెక్రటరీ యలమంచిలి శ్రీకాంత్, పీడీలు మల్లేశ్వరరావు, కె.చిట్టి.బాబు, ఉత్సవ కమిటీ సభ్యులు కొప్పినీడి గోపాలకృష్ణ, కుంచే ఈశ్వరరావు, చినమిల్లి మమ్ము, యాధంరెడ్డి శేషగిరిరావు, గన్నాబత్తుల బాబ్జీ పాల్గొన్నారు.

తెలుగు రాష్ట్రాల్లో కార్మికులపై పెరిగిన నిర్బంధం

సిఐటియు తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్

ప్రజాశక్తి - భీమవరం

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కార్మికులపై నిర్బంధం పెరిగిందని సిఐటియు తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్ అన్నారు. సిఐటియు 16వ రాష్ట్ర మహాసభకు విచ్చేసిన ఆయన ఆ కమిటీ తరపున సౌహార్ద్ర సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా జె.వెంకటేష్ మాట్లాడుతూ ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకే విధానాలు అవలంబిస్తున్నాయన్నారు. వైఎస్.జగన్ పాదయాత్రలో కార్మికులకు ఆశలు, ఆకాంక్షలు కల్పించి అధికారంలోకి వచ్చిన మూడేళ్ల కాలం గడుస్తున్నా హామీలు అమలు నోచుకోలేదన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు గడిచినా కార్మికుల మౌలిక సమస్యలను పట్టించు కోవడం లేదన్నారు. ఈ కాలంలో ఆంధ్ర రాష్ట్రంలో గహనిర్బంధం, అరెస్టులు, వేధింపులు మరింత పెరిగాయన్నారు. ఇది కార్మిక ఉద్యమాలకు అవరోధంగా మారిందన్నారు. ఉమ్మడి హైదరా బాదులో ధర్నా చౌక్, ఇందిరాపార్క్ వద్ద సుదీర్ఘ పోరాటాలు సమ్మెలు, ధర్నాలు జరిగాయని, అప్పటి చంద్రబాబు ప్రభుత్వం కు వ్యతిరేకంగా అంగన్వాడీ ఉద్యోగులు పోరాటం చేస్తే చంద్రబాబు మోపిన ఉక్కు పాదంపై ధర్నా చౌక్ ఉద్యమ కేంద్రంగా ఉందన్నారు. ఆ ధర్నా చౌక్‌ను కెసిఆర్ ప్రభుత్వం నిషేధించిందని, హైకోర్టు జోక్యంతో ధర్నాచౌక్ పునరుద్ధరణ జరిగిందన్నారు. హైకోర్టు జోక్యంతోపాటు సిఐటియు, ప్రజా సంఘాలు ప్రజా హక్కుల కోసం పోరాటాలు జరిగాయన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన ఎనిమిదేళ్ల కాలంలో అనేక ఉద్యమాలు కార్మికుల పక్షాన జరిగాయన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన పోరాటాల్లో వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ఉద్యమం స్ఫూర్తిగా నెలకొం దన్నారు. చాలాకాలంగా ఆంధ్రుల హక్కు విశాఖ ఉక్కు అనే పదం తెలంగాణలో ఆంధ్రుల హక్కు తెలుగు ప్రజల హక్కుగా మా రాష్ట్రంలో ఉద్యమించామన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పెద్ద ప్రభుత్వ రంగ సంస్థగా ఉందని, తెలంగాణలో సింగరేణి బొగ్గు కూడా అలాంటిదేనని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్మికోద్యమంలో వైజాగ్ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ ఉద్యమం ఓ మైలురాయి అని అన్నారు. మా రాష్ట్రంలో 73 షెడ్యూల్ పరిశ్రమలలో కార్మికులు కనీస వేతనాలు అమలు కోసం ఉద్యమాలు నిరంతరం కొనసాగుతున్నాయని అన్నారు. 2007 ఉమ్మడి షెడ్యూల్ రంగాల కార్మికులకు వేతనాలు పెరుగుదల లేదన్నారు. గత సంవత్సరం సెప్టెంబర్ నెలరోజుల పాటు 400 కిలోమీటర్లు పాదయాత్ర చేసి కార్మికులను కలిసి స్వతంత్ర ఐక్య కార్యాచరణతో ఐదు జిఒలను ప్రభుత్వం విడుదల చేసినా ఇప్పటికి గెజిటెడ్ నోటిఫికేషన్ ఇవ్వలేదన్నారు. ప్రభుత్వ రంగ పరిరక్షణ కోసం కేంద్ర రాష్ట్ర రంగాలతో పాటు షెడ్యూల్,ఉపాధి స్కీమ్ వర్కర్ల సమస్యలపై రెండు ప్రాంతాల్లోనూ ఉద్యమిస్తున్నామన్నారు. నేడు కార్మిక వర్గం మరింత సవాళ్లు ఎదుర్కొంటుందని, కార్మికులు ఐక్యం కావాల్సిన అవసరం ఉందని అన్నారు.

పారదర్శకంగా సంక్షేమ ఫలాలు : ఎంఎల్‌ఎ చెరుకువాడ

ప్రజాశక్తి - ఆచంట

రాష్ట్ర ప్రభుత్వం పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే సిఎం జగన్ లక్ష్యమని ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. మంగళవారం కొడమంచిలిలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు వివరించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అయన మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పింఛన్లు పెంచారన్నారు. ఈ సందర్భంగా డప్పు కళాకారునికి పెన్షన్ అందజేశారు. వైసిపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ చిల్లే లావణ్య, మాజీ ఛైర్మన్ సుంకర ఇందిరా సీతారాం, సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారాం, ఎంపిడిఒ జగన్నాథరావు, పంచాయతీ కార్యదర్శి డి.నాని, వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.



ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు

ఆచంట ఐటిఐలో బ్రిడ్జి కోర్సు

ప్రజాశక్తి - ఆచంట

పాలిటెక్నిక్ డిప్లమా కోర్సుల్లో నేరుగా ద్వితీయ సంవత్సరంలో చేరటానికి స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ ప్రవేశ అర్హత కోసం ఆచంటలోని ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో బ్రిడ్జి కోర్స్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఇందుకూరి వెంకట సత్యనారాయణ రాజు తెలిపారు. ఐటిఐలో ఏ కోర్సులోనైనా రెండు సంవత్సరాలు చదివి పాసైన అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఈ కోర్సుల్లో అభ్యర్థులకు, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్ సంబంధిత ల్యాబ్ ప్రాక్టికల్లో ఈనెల 9 నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకూ గవర్నమెంట్ ఐటిఐలో ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. అనంతరం ఎంపికైన అభ్యర్థులకు ఫిబ్రవరి 12 నుంచి 14వ తేదీ వరకూ ఎంపిక పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ సర్టిఫికెట్లు జిరాక్సులు, ఆధార్, ఫోటోలతో తమ కళాశాలలో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. మరిన్ని వివరాల కోసం 08814 299769 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

నేటి నుంచి విద్యార్థులకు సమ్మేటివ్ పరీక్షలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఈ నెల 4, 5, 6 తేదీల్లో పాఠశాల, హైస్కూళ్లలో సమ్మేటివ్ ఎగ్జామ్ (ఎస్ ఏ1) నిర్వహించనున్నట్లు ఎంఇఒ డి.శారదాజ్యోతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు ఉదయం 10 గంటల నుండి 12:30 నిమిషాల వరకూ, 1, 2వ తరగతులకు 4వ తేదీన ఫస్ట్ లాంగ్వేజ్, 5న ఇంగ్లీష్, 6న లెక్కలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 3, 4, 5 తరగతులకు 4న ఫస్ట్ లాంగ్వేజ్, 5న ఇంగ్లీష్, 6న గణితం, 7న ఇవిఎస్, అలాగే 6, 8, 10వ తరగతి విద్యార్థులకు 4వ తేదీన ఫస్ట్ లాంగ్వేజ్, 5న సెకండ్ లాంగ్వేజ్, 6న ఇంగ్లీష్, 7న 6వ తరగతికి లెక్కలు, 8వ తరగతికి సోషల్ స్టడీస్, 10వ తరగతికి లెక్కలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే పలు తరగతులకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

నిరుద్యోగులకు శిక్షణ

ప్రజాశక్తి - ఆచంట

నిరుద్యోగ యువతకు మెరుగైన ఉద్యోగావకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వ స్కిల్ హబ్ ద్వారా ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, ఫీల్డ్ ఇంజనీర్, ఎయిర్ కండిషనర్ కోర్సులకు మూడు నెలల నాన్ రెసిడెన్షియల్ శిక్షణ కల్పిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఇందుకూరి వెంకట సత్యనారాయణ రాజు తెలిపారు. ఈ శిక్షణాకాలంలో టెక్నికల్ శిక్షణతో పాటు, ఇంగ్లీష్, కంప్యూటర్స్, ఇంటర్వ్యూ స్కిల్స్ వంటి వాటిపై శిక్షణ కల్పించి ప్రముఖ కంపెనీలు, పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. 18 నుంచి 30 సంవత్సరాల్లోపు అభ్యర్థులు అర్హులని తెలిపారు. 8, 9, 10, ఇంటర్మీడియట్, ఐటిఐ డిప్లమా, పాస్ లేక ఫెయిల్ అయిన నిరుద్యోగ యువకులు నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు. మరిన్ని వివరాల కోసం 9490111002, 6304922617 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

సుష్మశ్రీకి సత్కారం

ప్రజాశక్తి - మొగల్తూరు

ఇటీవల నీట్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభకనబర్చి మెడికల్ సీటు సాధించిన మొగల్తూరుకు చెందిన కంపట్ల సుష్మశ్రీని మంగళవారం వివేక ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల యాజమాన్యం, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అభినందించారు. అమలాపురం కిమ్స్ మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్‌లో చేరిన సుష్మశ్రీ గ్రామానికి వచ్చారు. ఈ సందర్భంగా పాఠశాలలో సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గీతా రాంబాబు అధ్యక్షతన ఏర్పాటు చేసిన అభినందన సభలో గ్రామ సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ, ఉప సర్పంచి బోణం నరసింహారావు, మాజీ జడ్పీటిసి గుబ్బల నాగరాజు, దూసనపూడి దొరబాబు, మాజీ సర్పంచి మామిడిశెట్టి సత్యనారాయణ, లయన్స్ క్లబ్ ప్రతినిధులు మాట్లాడారు. పట్టుదలతో చదివితే సాధించలేనిది ఏదీ లేదని విద్యార్థులకు సూచించారు. సుష్మశ్రీని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అన్నారు. అనంతరం ఆమెను సత్కరించారు.

వి.వి.గిరిలో ఎంఎస్‌సి అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి - ఆకివీడు

ఎంఎస్‌సి కంప్యూటర్ సైన్స్ కోర్సుకు తమ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్నాయని, విద్యార్థులు వెంటనే తమను సంప్రదించాలని దుంపగడప వివి గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సుజాత మంగళవారం తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి ఎంఎస్‌సి కంప్యూటర్ సైన్స్ ప్రారంభించామని, ఇప్పటికే మొదటి సారి చేరికలు పూర్తయ్యాయని చెప్పారు. యూనివర్సిటీ రెండోసారి పిలుపునిచ్చిందని ఆమె తెలిపారు. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని, తమ కళాశాలకు వచ్చి కోర్సులో చేరవచ్చని తెలిపారు. విద్యార్థులు సర్టిఫికెట్లతో రావాలన్నారు.



పాలకొల్లు : లబ్ధిదారులకు పింఛను అందజేస్తున్న తాతాజీ

లబ్ధిదారులకు పింఛన్లు అందజేత

ప్రజాశక్తి - వీరవాసరం

ఇచ్చిన మాట ప్రకారం లబ్ధిదారులకు పెన్షన్ మొత్తాన్ని దఫాలుగా పెంచి మాట నిలబెట్టుకున్నారు ప్రభుత్వం వైసిపి ప్రభుత్వమని సర్పంచి నల్లిమిల్లి వేణుక అన్నారు. నవుడూరులో కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు మంగళవారం అందజేశారు. ఈ గ్రామంలో ఇప్పటి వరకు 427 పింఛనుదారులుండగా మరో ఎనిమిది కొత్త పెన్షన్లు మంజూరైనట్లు కార్యదర్శి వాణిప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి మానుకొండ ప్రదీప్‌కుమార్, వైసిపి సచివాలయ కన్వీనర్ పిల్లి నరసింహమూర్తి, కవురు సత్యనారాయణ, దేవిరెడ్డి గోపాలకృష్ణ పాల్గొన్నారు.

పాలకొల్లు : లబ్ధిదారులకు ఇచ్చిన మాట ప్రకారమే ప్రతి సంవత్సరమూ రూ.250 పెంచుతూ జగన్ మాట నిలబెట్టుకున్నారని డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ చెప్పారు. పట్టణంలోని 15వ వార్డులో కొత్తగా మంజూరైన పింఛను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జగన్ మహిళల ఆత్మ గౌరవం పెంచే విధంగా అడుగు బయట పెట్టకుండేటందుకే అర్హత ఉన్నవారికి గ్రామ వాలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటింటికి తెల్లవారుజామున తలుపు కొట్టి పెన్షన్ ఇస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి నేతలు చెన్ను విజయ్, పెచ్చెట్టి కృష్ణజ్యోతి, పాలపర్తి కృపనాధ్ పాల్గొన్నారు.


ఉండి : చెరుకువాడలో కొత్తగా మంజూరైన 21 పింఛన్లను సర్పంచి కొండేటి సాంబశివరావు అధ్యక్షతన డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి ఒకటో తేదీ నుంచి 2,750 రూపాయల పింఛను అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నాయకులు కొర్రపాటి అనిత, దాసరి సనాతన, కొండేటి సత్యనారాయణ, పాలకవర్గ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

ఎంపిపి హరిబాబు

ప్రజాశక్తి - ఉండి

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని మండల పరిషత్ అధ్యక్షులు కరిమెరకాపాటి శ్రీహరినారాయణ రాజు (హరిబాబు) అన్నారు. మంగళవారం ఉండిలో రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆకివీడు, ఉండి శాఖ ఆధ్వర్యంలో డైరీని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఉపాధ్యాయుల అభ్యున్నతికి తమ ప్రభుత్వం పాటుపడుతోందన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను విద్యాశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం రిటైర్డ్ ఉద్యోగులు ఆయనను సత్కరించారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా వైస్ ప్రెసిడెంట్ అల్లూరి గాంధీబాబు రాజు, మండల వైస్ ప్రెసిడెంట్ గాదిరాజు రంగరాజు మాట్లాడుతూ ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్లు ఇవ్వాలని, హెల్త్ కార్డులు దేనికి పనికి రావటంలేదని ఈ విషయంలో ప్రభుత్వం శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం వైస్ ప్రెసిడెంట్ ముదునూరి గోపాలరాజు, సభ్యులు విజ్జి ఆదినారాయణ, పెన్మెత్స రంగ ప్రసాదరాజు, గాదిరాజు కాశీ విశ్వనాథరాజు, పాకలపాటి రామరాజు, నానీ, చలపతి, వాసు పాల్గొన్నారు.



కొడమంచిలిలో నీరు లేక ఎండుతున్న నారుమడులు



పెదమల్లంలో నీరులేక ఎండిపోతున్న పంట బోదెలు

అందని నీరు.. ఎండుతున్న నారు..!

కాలువల్లో తగ్గిన నీటిమట్టం
పెరిగిన తూడు, గుర్రపుడెక్క
పొలాలకు సాగునీరందక రైతుల అవస్థలు

ప్రజాశక్తి - ఆచంట

డెల్టా ఆయకట్టు రైతులకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు. ముఖ్యంగా శివారు ప్రాంతాలకు సాగునీరందక అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. రబీ సాగులో నారుమడుల దశ నుంచి రైతులు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. పంట కాలువల్లో సమృద్ధిగా నీరు లేకపోవడంతో రైతులు ఇప్పటినుంచి పవర్ టిల్లర్, ఆయిల్ ఇంజిన్ల సాయంతో కాలువల్లో నీటిని తోడుకుంటూ దమ్ములు చేసుకుంటున్నారు. అయితే పంట కాలువలు తూడు, గుర్రపు డెక్కతో నిండి ఉండడం, ఆధునికీకరణ పనులు పూర్తిస్థాయిలో జరగకపోవడంతో శివారు ప్రాంత రైతులు సాగునీటి ఇబ్బందులు పడుతున్నారు. వరుస తుపాన్ల ప్రభావం కొంతమేర రబీ సాగుపై పడింది. గత సార్వా ఆరంభంలో భారీ వర్షాల కారణంగా ఈ సారి పంట ఆలస్యమైంది. ఇప్పుడు రబీ సాగు జాప్యానికి కారణమైంది. ఈ నేపథ్యంలో ఇప్పటికీ ఆకుమడులు కూడా పూర్తి కాలేదు. గత ఏడాది నవంబర్ నెలాఖరుకు సార్వా కోతలు పూర్తిచేయాలని, డిసెంబర్ నెలాఖరుకు రబీ నాట్లు పూర్తి చేయాలని అధికారుల నిర్ణయించినా ఫలితం లేకుండా పోయింది. దాళ్వాలో నాట్లు ఆలస్యం కావడంతో పంట చివరి దశలో సాగునీటి ఇబ్బందులు తప్పేటట్లు కనిపించడం లేదు. మరో పక్క గోదావరిలో నీటిమట్టం తగ్గిపోవడంతోపాటు అడుగడుగునా ఇసుక మేటలు కనిపించడం ఆందోళన కలిగిస్తోంది.

ఆక్రమణలు పూడికలతో..

నియోజవర్గ వ్యాప్తంగా సుమారు 52 వేల ఎకరాల్లో రబీ సాగు చేయడానికి రైతులు సన్నద్ధమవుతున్నారు. నాలుగు మండలాల పరిధిలోని ఆయకట్టుకు బ్యాంకు కెనాల్ నరసాపురం కాలువ, జెఎన్‌వి ఛానల్, రాపాక ఛానల్, ద్వారా సాగునీరు అందుతోంది. ఈ కాలువల పరిధిలో సుమారు 85 ఉప కాలువలు 270 శివారు పంట కాలువలు 500లకు పైగా పంట బోదెలు ప్రవహిస్తున్నాయి. ఉప కాలువలు శివారు పంట బోదెల్లో సుమారు మూడు వంతులకు పైగా ఆక్రమణలతో బక్కచిక్కిపోయాయి. ఆవాసాలకు దగ్గరలో ఉన్న కాలువలు చెత్త, వ్యర్థాలతో నిండిపోయాయి. దీంతో ఆచంట నియోజకవర్గంలో సాగునీటి ఎద్దడి ఏర్పడింది. మండలంలోని కొడమంచిలి, వల్లూరు, కరుగోరుమిల్లి, కందరవల్లి, శేషమ్మ చెరువు, పెదమల్లం, ఆచంట వేమవరం గ్రామాల పరిధిలో అధికంగా పంట బోదెలు కాలువలు ఆక్రమణలకు గురయ్యాయి. దీంతో ఆయా గ్రామాల పరిధిలోని శివారు భూములకు నీరు చేరడం కష్టంగా మారుతోంది. వల్లూరు, దేవ, ఆచంట-2, ఛానల్, కందరవల్లి, భీమలాపురం ఛానల్, కొటాలపర్రు ఛానల్, జగ్గరాజు ఛానల్, ఇల్లపర్రు ఛానల్ పోరా కాలువ పరిధిలోని ఆయకట్టు రైతులు సాగునీటి ఎద్దడితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పంట కాలువలో పడిపోయిన నీటి మట్టాలు

పంట కాలువల్లో నీటి మట్టం పడిపోవడంతో శివారు భూములకు నీరందక పనులు ముందుకు సాగడం లేదు. ఆచంట మండలంలో 11, 300 ఎకరాల్లో రబీ సాగు చేస్తున్నారు. ప్రస్తుతం నెలకొన్న నీటి ఎద్దడి, సార్వా మాసూళ్ల ఆలస్యం కావడంతో పనులు మందకొడిగా జరుగుతున్నాయి. పంట కాలువల్లో నీటిమట్టం తగ్గిపోవడంతో దమ్ములకు సైతం నీరు అందడం గగనంగా మారడంతో పనులు ముందుకు సాగడం లేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తక్షణం అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో సాగునీరందించాలని ఆచంట మండల రైతులు కోరుతున్నారు.

సావిత్రిబాయి పూలే ఆశయ సాధనకు కృషి చేయాలి



కాళ్ల : ఉపాధ్యాయినులను సత్కరిస్తున్న యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి - ఆచంట

సావిత్రిబాయి పూలే ఆశయ సాధనకు మహిళలు కృషి చేయాలని ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. మంగళవారం కొడమంచిలిలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పూలే ఆడపిల్లల చదువుల కోసం నిరంతరం పాటుపడ్డారన్నారు. ఉపాధ్యాయ వృత్తితో పాటు, కవిత్వంలో కూడా మంచి పట్టు ఉండేదని కొనియాడారు. కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ చిల్లే లావణ్య, సర్పంచి సుంకర సీతారామ్, ఎంపిటిసిలు చిలుకూరి దుర్గాభవాని, ఎల్లమెల్లి బేబీ రాణి, సర్పంచి జక్కంశెట్టి చంటి పాల్గొన్నారు.

కాళ్ల : ఆడపిల్లల చదువు కోసం పాటుపడి మహిళా చైతన్యానికి పునాది వేసిన యోధురాలు సావిత్రిబాయి పూలే అని జాతీయ బిసి సంక్షేమ సంఘం ఉండి నియోజకవర్గ అధ్యక్షుడు కొండేటి శివకుమార్ కొనియాడారు. బొండాడ పేటలో సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బొండాడపేటలో అంగన్వాడీ టీచర్లు సిహెచ్.కమల, కె.శ్రీదుర్గను సత్కరించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు గోళ్ల వెంకట రాంబాబు, సంఘం యూత్ అధ్యక్షుడు కట్టా వెంకట్రావు పాల్గొన్నారు. అంగన్‌వాడీ విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు.

సావిత్రీబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలని ఎంపిడిఒ జి.స్వాతి అన్నారు. యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో ఉత్తమ మహిళా ఉపాధ్యాయ పురస్కార ప్రదానోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. అనంతరం యుటిఎఫ్ ఆధ్వర్యంలో 15 మంది మహిళా ఉపాధ్యాయులను సత్కరించారు. ఎంఇఒ ఎ.రవీంద్ర మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయినీ ఒక్కో సావిత్రీబాయి పూలే కావాలన్నారు. యుటిఎఫ్ జిల్లా కోశాధికారి సిహెచ్ పట్టాభిరామయ్య మాట్లాడారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణంరాజు, మండల అధ్యక్షులు బిఆర్‌ఎంకె.స్వామి, గౌరవాధ్యక్షులు కె.సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఎం.శంకర్రావు, పిఎస్ రామకృష్ణ పాల్గొన్నారు.

పెనుగొండ : సావిత్రిబాయి పూలే జయంతిని కొటాలపర్రు ఎంపీ యుపి స్కూల్లో ఉపాధ్యాయులు శ్రీధర నరసింహమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో విజయాలు సాధిస్తున్నారని తెలిపారు. అనంతరం ఉపాధ్యాయిని ఎన్‌కె.రత్నం ఉమాదేవిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

పోడూరు : గుమ్ములూరు ప్రాథమిక పాఠశాల మెయిన్‌లో సావిత్రి బాయి పూలే జయంతిని పురస్కరించుకొని లవ్ పీపుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎల్‌పిఎఫ్ ఆచంట నియోజకవర్గ ఇన్‌ఛార్జి, జనసేన జిల్లా నాయకుడు రావి హరీష్ అధ్యక్షతన మహిళా ఉపాధ్యాయిని శాంతా గ్రేస్‌ను సత్కరించారు. రైతు దినోత్సవం రోజున జరిగిన పోటీ పరీక్షల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉన్నమట్ల ప్రేమ్‌కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొల్లాబత్తుల సూర్యకుమార్, జనసేన జిల్లా ప్రోగ్రామింగ్ కమిటీ సభ్యులు తోట సురేంద్ర పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : సావిత్రిబాయి పూలే జయంతిని డిఎన్ఆర్ కళాశాలలో మహిళా సాధికారిత విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ బిఎస్.శాంత కుమారి, ముఖ్యఅతిథిగా జె.రామలక్ష్మి మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధితో పాటు ముఖ్యంగా ఆరోగ్యంతో మంచి సమాజాన్ని స్థాపించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ సభ్యులు కె.శివరామరాజు, కళాశాల పరిపాలనాధికారి పి.రామకృష్ణంరాజు, వైస్ ప్రిన్సిపల్ సోమరాజు పాల్గొన్నారు.

మొగల్తూరు: స్త్రీ విద్య కోసం అహర్నిశలూ శ్రమించిన తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని పూలే, అంబేద్కర్ ఆశయ సాధన సమితి రాష్ట్ర నాయకులు కట్టా వేణు గోపాలకృష్ణ అన్నారు. ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ జిల్లా పరిషత్ పాఠశాలలో జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ హెచ్‌ఎం ఎం.బాలనాగమ్మ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయినులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బాల కుమారి, పాఠశాల స్టాఫ్ సెక్రటరీ చింతపల్లి కృష్ణమోహన్ సిబ్బంది పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం డైమండ్స్ లయన్స్ క్లబ్ అడ్మిన్ స్ట్రేటర్ లయన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు ఆధ్వర్యంలో అధ్యక్షులు కోనా హనుమాన్ సౌజన్యంతో మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని మంగళవారం సుబ్బారావు పేట మున్సిపల్ హైస్కులు, గరల్స్ హైస్కుల్‌లో నిర్వహించారు. ముందుగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ప్రధానోపాధ్యాయినులను సత్కరించారు.

కాపులకు రిజర్వేషన్లు సాధిస్తా : జోగయ్య

ప్రజాశక్తి - పాలకొల్లు

త్వరలో కాపులకు ఇడబ్ల్యుఎస్ కోటాలో 5 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని కోరుతూ కోర్టుకు వెళ్లడానికి పత్రాలు సిద్ధం చేస్తున్నట్లు కాపు సేన అధ్యక్షులు చేగొండి హరరామ జోగయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోర్టులో న్యాయం జరగకపోతే రాబోయే ఎన్నికల్లో పవన్‌కళ్యాణ్‌ను నెగ్గించుకోవడం ద్వారా రాజ్యాధికారం దక్కించుకుని రిజర్వేషన్లు సాధించుకోవటం తప్ప మరో ప్రత్యామ్నాయం లేదని తెలిపారు. ఇందుకు బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీతో పాటు అగ్రవర్ణాల వారిని కూడబెట్టుకొని విజయం సాధించుకోటానికి సిద్ధంగా ఉండాలని కోరారు. పవన్ కళ్యాణ్ సలహా మేరకు దీక్షను విరమించినట్లు తెలిపారు. పలుచోట్ల పోలీసులు అరెస్టులు చేసి, కేసులు పెట్టారని, న్యాయపరంగా ఎదుర్కోవడానికి కృషి చేస్తానని చెప్పారు.



జోగయ్యను పరామర్శిస్తున్న నాయకర్

జోగయ్యకు పలువురు నేతల పరామర్శ

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

కాపులకు 5 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ రాష్ట్ర కాపు సంక్షేమ సేన అధ్యక్షులు చేగొండి హరిరామ జోగయ్య ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. అయితే జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ పిలుపు మేరకు దీక్షను విరమించుకుని ఇంటికి తిరిగి వచ్చిన జోగయ్యను బుధవారం జనసేన నరసాపురం నియోజకవర్గ బొమ్మిడి నాయకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. జోగయ్య ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా నాయకులు పాల్గొన్నారు.

పాలకొల్లు :మాజీ మంత్రి చేగండి హరిరామ జోగయ్యను ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు మంగళవారం ఆయన స్వగృహంలో పరామర్శించారు. కాపులకు ఐదు శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ నిరవధిక నిరాహార దీక్షకు పూనుకుంటున్న వేళ పోలీసులు జోగయ్యను అరెస్ట్ చేసి ఏలూరు తరలించారు. పవన్ కళ్యాణ్ సలహా మేరకు దీక్ష విరమించారు. రాత్రి జోగయ్య పాలకొల్లు తిరిగి వచ్చారు. జోగయ్య ఆరోగ్య పరిస్థితిని ఎంఎల్‌ఎ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. కాపులకు రిజర్వేషన్ ఇచ్చే వరకూ ప్రాణాన్నైనా వదిలి సాధిస్తానని జోగయ్య తెలిపారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు, పట్టణ అధ్యక్షులు గండేటి వెంకటేశ్వరరావు జోగయ్యను కలిశారు.

నేరాలు - ఘోరాలు

వ్యక్తిపై కేసు నమోదు

ఉండి:వ్యక్తిపై దాడి జరిగిన సంఘటనలో ఉండి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాలు ఇలా ఉన్నాయి. ఉండి మండలం కోలమూరు గ్రామానికి చెందిన కింతాడ సూర్యనారాయణ ఆదివారం అదే గ్రామంలోని ఒక కిరాణా దుకాణానికి వెళ్లి సరుకులు తీసుకొస్తుండగా వైండింగ్ షాప్ నిర్వాహకుడు సిర్రా కనకారావు కింతాడ సూర్యనారాయణను పిలిచి అసభ్య పదజాలంతో దూషించి ఇనుప రాడ్డుతో తలపై కొట్టాడు. దీంతో సూర్యనారాయణ, కనకారావుపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గంగాధర్ రావు తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

పోడూరు:విద్యుదాఘతానికి గురై భవనంపైనుంచి కింద పడిన యువకుడు చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఈ ఘటన పోడూరులో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం పోడూరుకు చెందిన సలా పూర్ణ చంద్రసాయి (22) తండ్రి భసవయ్యకి సాయంగా పెయింటిగ్ పని చేస్తుంటాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం పోడూరు బాలా సంఘం సమీపంలో బల్ల కృష్ణవేణి గృహం ఆరుబయట విద్యుత్ స్తంభం ఎత్తులో రంగులు వేస్తుండగా భవనానికి దగ్గరలో తీగలు ఉండడంతో విద్యుదాఘాతనికి గురయ్యాడు. దీంతో పైనుండి కింద పడడంతో తలకు, చేయికి బలమైన గాయాలయ్యాయి. అతనిని వైద్యం నిమిత్తం పాలకొల్లు ఆస్పత్రికి తీసుకెళ్లగా మెరుగైన వైద్యం కోసం భీమవరం ప్రయివేట్ ఆస్పత్రిలో చేర్పించారు. మంగళవారం చంరదసాయి మృతి చెందాడు. ఎస్ఐ వై.నాగలక్ష్మి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి కల్పనే ప్రభుత్వ లక్ష్యం : ఎంఎల్‌ఎ గ్రంధి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పని చేస్తున్నారని ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ఆర్ఆర్‌డిఎస్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో ప్రభుత్వం ఆధ్వర్యంలో మంగళవారం మెగా జాబ్ మేళా జరిగింది. ఈ జాబ్ మేళాను ప్రారంభించిన ఎంఎల్‌ఎ మాట్లాడారు. జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన వెంటనే సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి లక్షల మంది నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగావకాశాలు కల్పించారని తెలిపారు. అంతేకాకుండా ప్రజలకు సేవ చేసే విధంగా వాలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి వారికి గౌరవ వేతనం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. నిరుద్యోగులు ఈ జాబ్ మేళాలకు హాజరై ఉద్యోగాలు పొందాలనే తపనతో ఉండటం తనకు ఎంతో సంతోషకరంగా ఉందన్నారు. జాబ్ మేళాను సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు పొందాలని కోరారు. ఈ మెగా జాబ్ మేళాకు హాజరైన వారిని చూస్తుంటే తనకు ఎంతో ఆనందం కలుగుతుందని, చదువు పూర్తి చేసిన తర్వాత ఉద్యోగాల కోసం తపన పడుతున్న వారంతా కూడా బాధ్యత తెలిసిన వారిగా తాను భావిస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపి పేరిచర్ల విజయ నరసింహరాజు, తోట భోగయ, ఎఎస్.రాజు, కొట్టి కుటుంబరావు, గోపిశెట్టి సుబ్బారావు, స్కిల్ డెవలప్మెంట్ జిల్లా అధికారి కృష్ణారెడ్డి పాల్గొన్నారు. ముందుగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి ఎంఎల్‌ఎ నివాళులర్పించారు.

నారుమడిలో జాగ్రత్తలు తీసుకోవాలి : ఎఒ

ప్రజాశక్తి - అత్తిలి

రైతులు నారుమడిలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎఒ టికెడిఎన్.రాజేష్ అన్నారు. మంగళవారం బొంతువారిపాలెంలో రైతులకు దాళ్వాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ 5 సెంట్లు నారుమడికి రెండు కిలోల నత్రజని, కిలో భాస్వరం, కిలో పొటాష్ వేయాలన్నారు. నారుమడి తీయడానికి ఏడు రోజుల ముందు సెంటు నారుమడికి 160 గ్రాముల కార్బో ఫ్యూరాన్ గుళికలు ఇసుకలో కలిపి పలుచగా నీరు ఉంచి వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు ఎన్.మోహన్‌కిషోర్, బొంతువారిపాలెం రైతులు పాల్గొన్నారు.

కాళ్లకూరులో పొలంబడి

ప్రజాశక్తి - కాళ్ల

ప్రస్తుత రబీ సీజన్‌లో వెదజల్లే పద్ధతిలో సాగు చేపట్టాలని కెఎస్ఎస్.శ్రీనివాస్ రైతులకు సూచించారు. కాళ్లకూరు గ్రామంలో పొలంబడి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పంట కాలంలో 14 వారాల పాటు రైతులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. నారుమడి దశలో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులు, ప్రధాన పొలం తయారీ, ఎరువుల గురించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని చామర్తి జయ వాసుకి, రైతులు పాల్గొన్నారు.

'పేదల కడుపు కొడుతున్న వైసిపి'

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పేదల కడుపు కొట్టడమే వైసిపి ధ్యేయమని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జి అన్నారు. మంగళవారం స్థానిక అన్నా క్యాంటీన్ వద్ద చినతాడేపల్లికి చెందిన పాస్టర్ పరిమి శేషగిరి, ఉషా కుటుంబ సభ్యుల సహకారంతో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి రాగానే అన్నా క్యాంటీన్లు తెరిచి పేదల ఆకలి తీర్చుతామన్నారు. రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గొర్రెల శ్రీధర్ మాట్లాడారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు పరిమి రవికుమార్, పెంటపాడు మండల అధ్యక్షులు కిలపర్తి వెంకట్రావు, డిసిసిబి మాజీ డైరెక్టర్ దాసరి అప్పన్న పాల్గొన్నారు.

కాపునాడు నరసాపురం నియోజకవర్గ అధ్యక్షులుగా శ్రీనివాస్ తాతాజీ

ప్రజాశక్తి - మొగల్తూరు

కాపునాడు నరసాపురం నియోజకవర్గ అధ్యక్షునిగా కొత్తట గ్రామానికి చెందిన సత్తినేని శ్రీనివాస్ తాతాజీ నియమితులయ్యారు. ఈ సందర్భంగా మొగల్తూరులో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను గతం నుంచి అన్ని వర్గాల ప్రజలకూ పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆ సేవా కార్యక్రమాలు కొనసాగించి కాపు సంఘీలకు మేలు చేయాలని కాపునాడు రాష్ట్ర అధ్యక్షులు గల్లా సుబ్రహ్మణ్యం తనను సంఘ నియోజకవర్గ అధ్యక్షునిగా నియమిస్తూ నియామక పత్రం అందించారన్నారు. అన్ని వర్గాల ప్రజలను కలుపుకుని వెళ్లడంతో పాటు, వారి ఐక్యతకు కృషి చేస్తానని తెలిపారు.

గుమ్మలూరులో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'

ప్రజాశక్తి - పోడూరు

గుమ్మలూరు గ్రామంలో టిడిపి ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు రుద్దరాజు సుబ్రహ్మణ్యం రాజు, నాయకులు దొంగ సూర్యప్రసాద్, కడలి నాగలక్ష్మి, కుక్కల దుర్గారావు, కడలి సత్యనారాయణ, పితాని సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఉండి : ఉండి 4వ వార్డులో టిడిపి గ్రామ అధ్యక్షులు కాగిత బుజ్జి అధ్యక్షతన మంగళవారం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎంఎల్‌ఎ రామరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయాంలో నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. ధరలను నియంత్రించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. కార్యక్రమంలో 4వ వార్డు సభ్యులు, తెలుగు యువత అధ్యక్షులు హరి నాయుడు, నాయకులు కిన్నెర వెంకన్న, కట్టా రాంబాబు, కాగిత మహంకాళి, గురుగుబిల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

శ్వేత గంగకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి

ఉండి:అరుదైన వ్యాధితో బాధపడుతున్న యువతికి శివ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా మెరుగైన వైద్యం అందిస్తామని మాజీ శాసనసభ్యులు వేటుకూరి వెంకట శివరామరాజు అన్నారు. ఎన్ఆర్‌పి అగ్రహారం, చెరువుగట్టు పాలెంకు చెందిన శ్రీనివాస్ కుమార్తె శ్వేత గంగ ఇటీవల అరుదైన వ్యాధికి గురికాగా గ్రామాంలోని నాయకులు శివరామరాజు దృష్టికి తీసుకురావడంతో ఆమెను మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో కాలంగా శివ సంస్థ ద్వారా అనేక మందికి వైద్య సౌకర్యాలు కల్పించామని అన్నారు. శ్వేత రంగకుకూడా సంస్థ ద్వారా ఆయుర్వేద వైద్య డాక్టర్‌కు చూపించి వ్యాధి నివారణ కోసం కృషి చేస్తానని తెలిపారు. ఆయన వెంట పొత్తూరి వెంకటేశ్వరరాజు, దూసనపూడి రాంబాబు, ముగ్గళ్ల సత్యనారాయణ, బురిడి రవిబాబు పాల్గొన్నారు.